ఆకట్టుకున్న ఎయిర్ షో

- రాహుల్ సిప్లిగంజ్ ధూంధాం కేరింతలు
- స్వయంగా వీక్షించిన సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- కట్టిపడేసిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు
- ట్యాంక్‌బండ్‌పై సందే సందడే సందడి

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

ఇసుకేస్తే రాలనంత జనంతో ఆదివారం సంధ్యాసమయంలో ట్యాంక్‌బండ్ కిటకిటలాడిపోయింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆధ్వర్యంలో అజయ్ నేతృత్వంలో 9 సూర్యకిరణ్ విమానాలతో నిర్వహించిన ఎయిర్‌షో అదరహో అనిపించింది. ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద వాయుసేన విన్యాసాల కార్యక్రమాన్ని, భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డు వద్ద ఉన్న హెచ్ఎండిఏ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ట్యాంక్‌బండ్‌పై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సందర్శించారు. పిల్లాపాపలు...చిన్నాపెద్దా...అనే తేడా లేకుండా వైమానిక దళాలు ప్రదర్శించిన విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విమానాలు తమ సమీపానికి వచ్చిన ప్రతిసారీ కేరింతలు కొడుతూ ఎంజాయ్ చేశారు. తమ సెల్‌ఫోన్లలో బంధించారు. వాయుసేన విమానాల ప్రదర్శనతో వీక్షకులు కుటుంబ సమేతంగా సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. ఎయిర్‌షోలో విమానాలు 360 డిగ్రీల కోణంలో తిరగడం, పల్టీలు కొట్టడం, ఒకదానినొకటి క్రాస్ చేసుకోవడం, త్రివర్ణ పతాకాన్ని సూచించేలా మూడు రంగుల పొగను ఒక స్కీన్‌పై విడుదల చేయడం, లవ్ సింబల్, దాని మధ్యలో బాణం గుర్తును గీయడం లాంటి విన్యాసాలు అబ్బురపరిచాయి. 'మా ప్రదర్శనలు వీక్షించండి' అన్నట్టుగా ఎయిర్‌షో జరుగుతున్న క్రమంలోనే పక్షులు కూడా గుంపులుగా ట్యాంక్‌బండ్‌పై చక్కర్లు కొట్టడం వీక్షకులను కట్టిపడేసింది. ఎయిర్‌షోను, రాహుల్ సిప్లిగంజ్ పాటలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, ఆయా శాఖల ఉన్నతాధికారులు ట్యాంక్‌బండ్, ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ వేదికల నుంచి వీక్షించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు సమాచార శాఖ కమిషనర్ హరీశ్ స్వాగతం పలికారు.

నమస్తే చిచ్చాస్ 1,2,3,4....

'నమస్తే చిచ్చాస్...1,2,3,4...అరె పొద్దుగాలే బయలెళ్లి..బోనంపెట్టి బయలెళ్లి ..గండిమైసమ్మ మొక్కులు...గాలిమైసమ్మరెళ్లు..అరె..పెద్దపులి...' అంటూ తన గాత్రంతో రాహుల్ సిప్లిగంజ్ హుషారెత్తించారు. పోతురాజు వేషం వేసిన కళాకారులతో ఆడిపాడారు. ఆయన ఆ పాట పాడుతున్నంత సేపు వీక్షకులు కూడా డ్యాన్స్ చేసి మరింత జోష్ పెంచారు. 'ఓహో ఓహో జంబియా..వలంపల్లి జంబియా..నాతో మాట్లాడు జంబియా..' అని పాడుతూ ఉర్రూతలూగించారు. నాటునాటు..సాంగ్‌తో పాటు పలు పాటలను పాడి వీక్షకులను మెప్పించారు. రాహుల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సత్కరించారు. మరో రెండు వేదికల్లో జి.నీల బృందం బోనాల కోలాటాన్ని, మైథిలి అనూప్ బృందం మోహిని అట్టం, ప్రమోద్‌రెడ్డి బృందం భరతనాట్యాన్ని పదర్శించాయి. టీఎస్ఎస్ కళాకారులు పాటలు పాడి వినిపించారు. బిర్రు కిరణ్ టీమ్ థియేటర్ స్కిట్‌ను ప్రదర్శించింది.

డిమాండ్లు నెరవేర్చాలి

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

హైదరాబాద్ బ్యూరో : వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లతో పాటు ఈఎస్ఐ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని కోఠిలో ఆ సంఘం మొదటి జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి వంది మంది నాయకులు హాజరయ్యారు. రిమోట్ గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీల అలవెన్స్, 142 జీవో సవరణ, టీవీవీపీ ని డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్పు, ఈఎస్ఐ డైరెక్టర్‌గా డాక్టర్‌ను నియమించడం తదితర డిమాండ్లపై సమావేశంలో చర్చించి తీర్మానించారు. ఈ డిమాండ్లతో వచ్చే వారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్టు నాయకులు తెలిపారు.

మెట్రో కారిడార్లు, స్టేషన్లలో ప్రజాపాలన విజయోత్సవాలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిశానిర్దేశంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శించింది. 'జయ జయహే తెలంగాణ–జననీ జయకేతనం' అంటూ తెలంగాణ స్ఫూర్తిని అంది పుచ్చుకుంటూ మొత్తం 25 మెట్రో స్టేషన్లలో కొత్తగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' చిత్రాలను ఏర్పాటు చేసినట్టు హెచ్ఎంఆర్ఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రజాపాలన విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో జోరుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మెట్రో రైల్ రెండవ దశ ముఖ్య అంశాలను తెలియజేసేలా స్టేషన్ల కాన్‌కోర్స్, ప్లాట్‌ఫామ్‌లపైన స్టాండ్‌లను ఏర్పాటు చేశామని, ప్రధాన మార్గాల్లో మెట్రో పిల్లర్లకు హోర్డింగ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సంవత్సరం కాలంలో ప్రభుత్వ విజయాలను, మెట్రో సాధిస్తున్న ప్రగతిని వివరించామని వెల్లడించారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో ముఖ్యమైన మెట్రో మార్గాలు ప్రజలను విశేషంగా అలరిస్తున్నాయి. కాంగ్రెస్ ఏడాది పాలన విజయాలను ఘనంగా ప్రతిబింబించేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, నేను సైతం అంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటోంది.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రుణమాఫీలో కేంద్రం బాధ్యతలు విస్మరించడం తగదు

- రైతు బిడ్డగా తెలంగాణ తల్లి విగ్రహం : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రైతులకు రుణమాఫీ చేసే విషయంలో ఒక రాష్ట్రానికే బాధ్యత ఉంటుందా.. కేంద్రానికి బాధ్యత లేదా అని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యుపిఎ హయాంలో కేంద్రమే బాధ్యత తీసుకుని రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిర భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బిడ్డను పోలి ఉండేలా విగ్రహాన్ని రూపొందించినట్టు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు విషయంలో బీఆర్ఎస్ విమర్శలు తగవన్నారు. తెలంగాణ తల్లి అనేది సామాన్యుల తల్లి, అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం, రూ.500లకే సిలిండర్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రైతులు పండించిన సన్న రకం వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వడం లేదన్నారు. మహిళా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో అమలు చేస్తున్నామన్నారు. దేశంలో మీరెక్కడైనా అమలు చేస్తున్నారా అని బిజెపి జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాను ప్రశ్నించారు.

నేటి నుంచి అసెంబ్లీ

- ఒక్కరోజే...మళ్లీ 16 నుంచి కొనసాగింపు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, యూపీఏ చైర్‌పర్సన్‌గా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు ధన్యవాద తీర్మానంపై చర్చించి, సంతాప తీర్మానాల అనంతరం సభను మళ్లీ ఈనెల 16వ తేదీకి వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. సోమవారమే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మెన్‌తో పాటు మంత్రులంతా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దాదాపు లక్షమంది మహిళలను తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అన్ని జిల్లాల కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు టార్గెట్లు విధించినట్టు సమాచారం. దీనితో ఆదివారం నుంచే సచివాలయం, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో జనసమ్మర్దం పెరిగింది. ఇక్కడ నిర్వహించిన ఎయిర్‌షో, విమాన విన్యాసాలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అట్టహాసంగా నిర్వహించిన ప్రజాపాలన వార్షికోత్సవ వేడుకల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులంతా బిజీగా ఉన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు జనసమీకరణ సహా అనేక బాధ్యతలు వారిపై ఉన్నాయని, అందువల్ల సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించి, వారం తర్వాత తిరిగి కొనసాగించాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాదరావు, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం అసెంబ్లీ కార్యాలయంలో సమావేశమై నిర్ణయించినట్టు సమాచారం. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు రాతపూర్వకంగా సమాధానాలు ఇవ్వాలని స్పీకర్ ప్రసాదరావు ఆదేశించారు. అయితే ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం తలమునకలై ఉండటంతో ఆ పనులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఈ వారం రోజుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలన్నింటికీ రాతపూర్వక సమాధానాలు ఇచ్చాకే, తిరిగి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ వారం రోజుల్లోనే సీఎం సహా కొందరు మంత్రులు ఢిల్లీకి వెళ్లాల్సి ఉందని, మంత్రివర్గ విస్తరణతో పాటు కేంద్రం నుంచి రావల్సిన నిధుల విషయంలో అధికారుల్ని కలిసిరావాల్సి ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యుత్ కమిషన్ నివేదికపై కూడా అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో దాన్ని అధ్యయనం చేయాల్సి ఉంది. రైతు భరోసాకు సంబంధించిన విధివిధానాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని సబ్‌కమిటీ సిఫార్సులను పరిశీలించి, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి, నిర్ణయాలు తీసుకోనున్నారు. అన్నింటికీ ప్రజాపాలన విజయోత్సవాలే ప్రధాన అవరోధంగా ఉండటం, జిల్లాలు సహా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అంతా అవే పనుల్లో నిమగ్నమై ఉండటంతో అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, మళ్లీ వారం తర్వాత పూర్తిస్థాయి చర్చలు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నది.

విఆర్ఎ, విఆర్ఒ వ్యవస్థను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు రానున్న ఆర్‌వోఆర్ చట్టంలో విఆర్ఎ, విఆర్ఒ వ్యవస్థను పునరుద్ధరించాలని రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. కొత్త ఆర్వోఆర్ చట్టం రూపకల్పన, తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో అధికారాల వికేంద్రీకరణ, రెవెన్యూ ఉద్యోగులపై దాడులు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతర ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను ఎత్తేయడం వల్ల మొత్తం ప్రభుత్వ వ్యవస్థనే నిర్వీర్యం అయ్యిందని పేర్కొన్నారు. ఫలితంగా లగచర్ల, నిర్మల్ వంటి ఘటనలు జరిగే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సంతోషకరమనీ, ఈ ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగులుగా అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ, టిజిటిఎ అధ్యక్షులు ఎస్ రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టిజిఆర్ఎస్ఎ నూతన కమిటీ ఎన్నిక

టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర నూతన కమిటీని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిక్షం, కోశాధికారిగా మల్లేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుజాత చౌహాన్ ఎన్నికయ్యారు.

బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అధోగతి

- కాంగ్రెస్ పాలనలో సమానంగా సంక్షేమం, అభివృద్ధి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

గత బిఆర్ఎస ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, వారు చేసిన రూ.7 వేల కోట్ల పైచిలుకు అప్పులకు వడ్డీలు కడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెడ్ల లెక్క సమానంగా నడుపుతూ ముందుకు తీసుకెళ్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం కేంద్రంలో అమృత్ పథకం కింద రూ.25.58కోట్ల అంచనాతో అభివృద్ధి కార్యక్రమాలు, కురవి మండలం కందికొండలో సుమారు రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాలల భవన సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పండిన మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తున్నదని అన్నారు. సన్న రకాలకు రూ.500 బోనస్‌తో పాటు రైతులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్టు చెప్పారు. పేదవారి కలలను నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టి రూ.5లక్షల రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అన్ని తరగతుల ప్రజలు కుల, మత భేదం లేకుండా ఒకే దగ్గర చదువుకునేలా కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారికత, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉచిత బస్సు సర్వీసు, పేద విద్యార్థులకు భారం కాకుండా మెస్ చార్జీలు పెంచడం, క్షేత్రస్థాయిలో గ్రామీణ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్, జిల్లా పరిషత్ సిఇఒ పురుషోత్తం, డిఆర్‌డి మధుసూదన్‌రాజు, జిల్లా అధికారులుకిరణ్‌కుమార్, మరియన్న, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, హౌసింగ్, మెప్మా జయ శ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

ఏడాదిలో రూ.90 వేల కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ బ్యూరో : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలో రూ.90 వేల కోట్ల పెట్టుబడులు సమీకరించిందని ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రజావిజయోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని పార్క్‌హయత్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు కంపెనీలతో పెట్టుబడులకు సంబంధించిన ఎంవోయూలను కుదుర్చుకుంది. టీఫైబర్, మీ సేవ, టీ–వర్క్స్, టీజీన్యాబ్ అప్లికేషన్, అడెక్స్, ప్రాజెక్టు సన్మతి మొదలగు ఐటీ సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో రూ.40 వేల కోట్లు, అమెరికా, దక్షిణకొరియా పర్యటనలో రూ.32 వేల కోట్లు, స్థానికంగా మరో రూ.19 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాల పోటీలను తట్టుకుని తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలను ఒప్పించామని పేర్కొన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడం ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నామని చెప్పారు. పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే వారికి అనుమతుల నుంచి మొదలుకుని రాయితీల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధివిధానలతో ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. గత సర్కార్ పదేండ్ల పాలనలో రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఇ) పరిశ్రమలు పీకల్లోతు కష్టాల్లో కొట్టుమిట్టాడాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే వాటి స్థితిగతులపై అధ్యయం చేసి దేశంలోనే మొదటి సారిగా కొత్త ఎంఎస్ఎంఇ పాలసీ తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. పదేండ్లుగా రాయితీలు అందక ఈ రంగానికి వివిధ సబ్సిడీల రూపంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,000 కోట్లకు చేరుకున్నాయని చెప్పారు. వీటన్నింటిని దశల వారీగా చెల్లించేందుకు తమ సర్కార్ సిద్దంగా ఉందని అన్నారు.నాలుగు కంపెనీలతో ఎంవొయులు

కొత్తగా 5,200 మందికి ఉద్యోగాలు

ఈ సందర్భంగా కొత్తగా నాలుగు ప్రముఖ కంపెనీలతో పెట్టుబడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయులను కుదుర్చుకుంది. ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీ రూ.800 కోట్లు, ప్రీమియర్ ఎనర్జీస్ 1,950 కోట్లు, ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ కంపెనీ సోలార్ రంగంలో రూ.3,342 కోట్లు, లెన్స్‌కార్ట్ సంస్థ రూ.1,500 కోట్లు మొత్తం రూ.7,592 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటికి సంబంధించి ఆయా సంస్థల ప్రతినిధులు మంత్రి సమక్షంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. వీటి ద్వారా 5,200 మందికి ఉద్యోగ అవకాశాలు అందనున్నాయి. ఈ కార్యక్రమంలో టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ మల్సూర్, టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.వి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఆజాద్ ఇంజనీరింగ్, లెన్స్‌కార్ట్, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రతినిధులు భూపతి రాజు, అమిత్ చౌదరి, రేవతి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధమవ్వాలి

- హక్కుల సాధన, రక్షణకు ఉద్యమాలే శరణ్యం
- బిజెపి మతోన్మాదంపై కార్మికరంగాల్లో అవగాహన అవసరం
- అదానీని రక్షించే పనిలో ఉన్న శ్రద్ధ.. దేశ ప్రజలపై మోడీకి లేదు : జి నాగయ్య

మహాసభలో మాట్లాడుతున్న నాగయ్య

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

'పోరాటాలకు ప్రజలు సిద్ధమవ్వాలి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మతవైషమ్యాలు రెచ్చగొడుతూ ఓట్ల రాజకీయం చేస్తూ అధికార పీటంపై కూర్చుంటోంది. క్రమంగా ప్రజల హక్కులను హరిస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ వస్తోంది. గుజరాత్ అల్లర్లు మొదలుకుని ఇటీవలి మణిపూర్ హింసాకాండ వరకూ ఆ పార్టీ చేస్తున్న ఆరాచకాలు అంతాఇంతా కాదు. ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా.. రాజ్యాంగాన్ని మార్చి మనుస్మృతిని అమలు చేయాలనే కుట్ర చేస్తోంది. ఇది కచ్చితంగా ప్రజల హక్కులను హరించడమే.. మరోవైపు రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు సైతం ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయడం లేదు. పాలకులుగా ప్రజల ఆస్తులు కాపాడాల్సింది పోయి.. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాల్సిందే. అందుకు ఎర్ర జెండా ఎళ్లప్పుడూ వెంట ఉంటుంది. ఉద్యమాల ఖిల్లా అయిన జగిత్యాల జిల్లాలో కమ్యూనిస్టు పోరాట చరిత్ర మరువలేం. ఆ స్ఫూర్తితోనే ఉద్యమాలకు సిద్ధం కావాలి' అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జీ.నాగయ్య పిలుపునిచ్చారు. సిపిఎం జగిత్యాల జిల్లా మూడో మహాసభలను కోరుట్ల పట్టణంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బస్టాండ్ నుంచి సినారె భవన్ (సభాప్రాంగణం) వరకు పెద్దఎత్తున ప్రజాప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రాంగణ వేదికపై కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలు వేసి నివాళ్ల అర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం పార్టీ నాయకులు ఇందూరి సులోచన, ఎంఏ చౌదరి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో నాగయ్య ప్రసంగించారు.

గుజరాత్ అల్లర్లు మొదలుకుని మణిపూర్ హింసాకాండ వరకూ చోటుచేసుకున్న ప్రతి మత ఘర్షణల్లో ఆర్ఎస్ఎస్, బీజేపీ పాత్ర ఉందని వివరించారు. పైగా మణిపూర్‌లో గిరిజనుల మధ్య హింసాకాండను చెలరేపి అక్కడి కొండప్రాంతాలను ఖాళీ చేయిస్తోందన్నారు. అందుకు అక్కడి భూగర్భంలోని ఖనిజాలు అదానీ లాంటి కార్పొరేట్లకు అప్పగించే కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాజ్యాంగ యంత్రాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకొని రాచరిక పాలన సాగిస్తోందన్నారు. మతం, ఆహారపు అలవాట్లు వ్యక్తిగతమైనా.. అందులోనూ ఆంక్షలు చెలరేపుతూ ప్రజల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. రాజస్థాన్‌లో అజ్మీరా దర్గా ఒకప్పటి హిందూ ఆలయమని, దేశంలో మసీదులు, చర్చీలు కూలదూసే పనిగట్టుకుందని తెలిపారు. మరోవైపు ఆదిలాబాద్ లాంటిప్రాంతంలో ఓ మైనార్టీ వ్యక్తి గిరిజన మహిళపై లైంగికదాడి చేస్తే.. యావత్తు మైనార్టీ ఇండ్లన్నీ ధ్వంసం చేసేలా ఉసిగొల్పిందన్నారు. సనాతన ధర్మం గొప్పదంటూ ప్రచారం చేస్తున్న ఆ పార్టీ.. ఆధర్మంలో దళితులకు, మహిళలకు ఏ స్థానం ఉందో చెప్పగలరా అని ప్రశ్నించారు. అదానీకి దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా లంచాలు ఇస్తూ సంపద దోచుకుంటున్న తీరు ఇటీవల బట్టబయలైందని, అమెరికాలో ఏకంగా ఆయనపై కేసు కూడా నమోదైందని తెలిపారు. అయినా ఆయనపై చర్యలు తీసుకోకుండా రక్షించే పనిలో కేంద్రంలోని బిజెపి ఉందని విమర్శించారు. బిజెపి తీరు ఇలానే కొనసాగితే శ్రీలంక ఉదంతమే పునరావృతమవుతుందని చెప్పారు. ఆ దేశంలో ప్రజలంతా ఆకలికేకలతో రోడ్డెక్కితే అప్పటివరకూ ఉనికిలో లేని ఎర్రజెండానే అండగా నిలబడిందని, ఏకంగా ఇప్పుడు కమ్యూనిస్టు నేతనే దేశాధ్యకుడిగా ఎన్నికయ్యాడని తెలిపారు.

హామీల అమలులో రాష్ట్ర సర్కారూ విఫలం

ఆరుగ్యారంటీలు సహా సుమారు 400లకుపైగా హామీలిచ్చి ప్రజాస్వామ్య పాలన అందిస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు ఈ రాష్ట్ర ప్రజలు అధికారం కట్టబెట్టారని తెలిపారు. అయితే మహిళలకు ఫ్రీబస్సు పథకం తప్ప మిగిలిన గ్యారంటీలన్నీ మరిచిపోయిందన్నారు. మహిళలకు రూ.2500సాయం, దళితబంధు స్థానంలో అంబేద్కర్‌పేరుతో రూ.12లక్షలిచ్చే పథకం, రైతుభరోసా, రైతుబీమా వంటి పథకాలకు ఇంకా రూపకల్పనే చేయలేదన్నారు. రూ.రెండు లక్షల్లోపు రైతుల రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం లక్షన్నర వరకు రుణాలు మాత్రమే దశలవారీగా మాఫీ చేసిందని, అందులోనూ ఇంకా అర్హులు మిగిలారని, వారితోపాటు మిగిలిన రైతుల రుణాల మాఫీపై ఇంకా స్పష్టత ఇవ్వలేదన్నారు. మరోవైపు పేదలంతా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటుంటే బుల్డోజర్లతో బిఆర్ఎస్ కూల్చిందని అన్నారు. అదే సంస్కృతి కాంగ్రెస్ కొనసాగిస్తోందన్నారు. పాలకులు మారినా మారని విధానాలపై ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. సిపిఎం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, ఈ మహాసభల్లో అందుకు అవసరమైన భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ మహాసభల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు పి శ్రీకాంత్, టీ10 సిఇఒ సుందర్, సిపిఎం జగిత్యాల జిల్లా కన్వీనర్ జి తిరుపతినాయక్, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరయ్యారు.

మహారాజశ్రీ డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.104/2019

Between:-
కర్రి సర్రెడ్డి అండ్ అనదర్ ...వాద్దు
And
శ్రీమతి గంద్ర ఉమాదేవి అండ్ అదర్స్ ...ప్రతివాద్దు

To
D4. గంద్రసాయి ఆశ్రేయ్(Gandra Sai Ashray) S/o. (లేటు) శ్యామ్ సుందర్ రెడ్డి D.No.110,అపర్ణ గార్డేనియా, చందానగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

మీరు సదరు పై నెంబర్ దావాలో 4వ ప్రతివాది అయి ఉన్నారు. సదరు వాద్దు మీపై మరియు ఇతర ప్రతివాద్దుపై తమకు మీ తండ్రిగారైన గంద్ర శ్యామ్ సుందర్ రెడ్డి ద్వారా రావలసిన ప్రోనోటు బాకి వసూలు కొరకు అయిన ఆస్తులుపై డిక్రీ ఇప్పించవలసిందిగా మీ పై సదరు కోర్టులో పై నెంబరు దావా వేసి యున్నారు. సదరు కోర్టు వారు మీకు ఎన్ని సార్లు దావా సమన్లు పంపినప్పటికి మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. సదరు దావా వాయిదా **17-12-2024** అయి ఉన్నది. కావున ది.వి.**17-12-2024** ఉదయం గం.**10.30** ని॥లకు మీరు స్వయంగా గాని మీ ప్లీడరు గారి ద్వారా గాని సదరు కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోలేని యెడల సదరు దావా మీ పరోక్షమందు తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

కే.వి.సత్యవాణి
అడ్వకేటు
రామచంద్రపురం
కోనసీమజిల్లా

రామచంద్రపురం
07-12-2024

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు
E.P.No.13/2020 in O.S.No.87/1984

Between:
పులపర్తి నరసింహమూర్తి (Died) వగైరా ...డి.హెచ్.ఆర్స్/వాదులు
మరియు
జక్కంశెట్టి శరశ్చంద్రబాబు వగైరా ...జె.డి.ఆర్స్/ప్రతివాదులు

టు
4వ జె.డి.ఆర్ : శ్రీ జక్కంశెట్టి రవీంద్ర @ కాసులు, తండ్రి సుబ్బారావు, అడ్వకేట్, డోర్.నెం.11-6-648, క్రిమినల్ కోర్టు ఎదురుగా, రెడ్‌హిల్స్, నాంపల్లి, హైదరాబాదు-500004, సెల్: 9391378540
7వ జె.డి.ఆర్ : శ్రీ జక్కంశెట్టి సరోజినీ, తండ్రి సుబ్బారావు, C/o.జక్కంశెట్టి రవీంద్ర @ కాసులు, అడ్వకేట్, డోర్.నెం.11-6-648, క్రిమినల్ కోర్టు ఎదురుగా, రెడ్‌హిల్స్, నాంపల్లి, హైదరాబాదు-500004, సెల్: 9391378540

పై నెంబరు దావా డిక్రీ ప్రకారం నమూనా క్రియ దస్తావేజు ప్రకారం క్రియ దస్తా వేజు దస్తావేజులను 2 మరియు 3 డిక్రీ హోల్డర్సు పేర వ్రాయించి రిజిష్టర్ చేయించి ఇప్పించగలందులకు కోరుతూ వారంటు అమలు గ్రంథమును పై డిక్రీ హోల్డరు దాఖలు చేయగా కోర్టు వారు మీకు ఎన్నిమార్లు Under or 21 Rule 34 CPC నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున పై నెంబరు గ్రంథములో మీపై పేపర్ ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయుటకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు గ్రంథములో మీరు **23-12-2024** తేది ఉదయం గం.10.30 ని॥ల నుండి స్వయముగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనుటకు వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజున హాజరై అభ్యంతరములు తెలియజేసుకోవలెననిన్నీ లేనిచో సదరు వారంటు అమలు గ్రంథము మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

నర్సాపురం
ది.08-12-2024

సరిపల్లి రామసత్తయ్య
అడ్వకేట్,
సెల్ : 9848837555

నోటీసు
మహారాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్), నర్సాపురం
E.A.No.113/2021 in E.P.No.42/2018 in O.S.No.12/2016

బిట్వీన్ :
మేడిచర్ల వెంకట సత్యనారాయణ (Died) వగైర ...పిటిషనర్స్/డి.హెచ్.ఆర్
మరియు
ఎక్కులూరి కనకదుర్గ ...రెస్పాండెంట్/జె.డి.ఆర్

టు:
ఎక్కులూరి కనకదుర్గ, W/o.చిన రంగయ్య, అపర్ణఫామ్ గ్రోవ్ వెనుక, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీస్ (రిజిష్టర్ నెం.309/2), బి.ఎస్.ఎన్.ఎల్.హైట్స్ బిల్డింగ్, (బి.ఎస్.ఎన్.ఎల్ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ) దేవేందర్ కాలనీ, కొంపల్లి, హైదరాబాద్ - 500014.

పై నెంబర్ ఇ.పి.లో డిహెచ్ఆర్ మరణించగా అతని తాలూకు వారసులుని చేర్చమని పైనెంబర్ ఇ.ఎ దాఖలు చేయగా, శ్రీకోర్టు వారు రెస్పాండెంట్/జెడిఆర్ అయిన మీకు అనేక పర్యాయములు నోటీసులు జారీ చేసియున్నప్పటికి, మీరు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా దాట వేయుచున్నందున, సదరు ఇ.ఏలో మీ హాజరు కొరకు ది.**26-12-2024** సం.తేదికి వాయిదా వేసియున్నారు. గాన సదరు వాయిదా తేది. 26-12-2024 ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు నందు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ సంజాయిషి తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం ఈ ప్రకటన ఇవ్వడమైనది)

అడ్డాల తులసి వీరదాసు
అడ్వకేట్, పాలకొల్లు.
సెల్: 98497 25667

తేది.08-12-2024
నర్సాపురం

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాలన

- ప్రభుత్వాలు మారినా అపరిష్కృతంగానే ప్రజా సమస్యలు
- శ్రీలంక తరహాలో కమ్యూనిస్టులకు పూర్వ వైభవం తథ్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాలు మారినా ప్రజా సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయని, ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శ్రీలంక తరహాలో మన దేశంలోనూ కమ్యూనిస్టుల పాలన తథ్యమనే విశ్వాసంతో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ మహాసభలో తమ్మినేని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కెసిఆర్ పదేళ్ల ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా పాలించారన్నారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే ఏ పార్టీ చెప్పినా సమస్యలు ఒకే విధంగా ఉంటాయన్నారు. విద్య, వైద్యం, భూమి, ఉద్యోగం, ఉపాధి, సరైన వేతనం, సామాజిక న్యాయం ఉన్నప్పుడు ప్రతి కుటుంబం హాయిగా... సోషలిజం తరహాలో జీవిస్తాయని వివరించారు. ఏ పార్టీ చెప్పినా ఈ ఏడు అంశాల గురించే చెబుతుంటాయని, కమ్యూనిస్టులు వీటన్నింటినీ ప్రభుత్వమే సమకూర్చాలంటున్నాయని, కానీ బూర్జువా పార్టీలు వీటిని ప్రయివేట్ చేతిలో పెడతాయని తెలిపారు. కమ్యూనిస్టు రాజ్యంలోనే విద్య, వైద్యం ఉచితంగా లభిస్తాయని చెప్పారు. పరిశ్రమలు రావాలన్నా.. ఉద్యోగ కల్పన జరగాలన్నా.. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్నా.. ఎర్రజెండాలోనే సాధ్యమని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పా... మిగిలిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. రైతుబంధు కింద ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు వస్తాయని ఓటు వేస్తే ఉన్న రూ. పది వేలు పోయాయని అన్నారు. ఏడాది కాలంగా రైతు భరోసా పంట పెట్టుబడి పథకాన్ని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు రూ. 12వేలు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగులకు భృతి ఇవేవీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా గత కెసిఆర్ ప్రభుత్వం ఐదు లక్షల ఎకరాలకు పోడు పట్టాలిస్తే.. రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చాక మిగిలిన మూడు లక్షల ఎకరాలకు పట్టాలిస్తామన్న హామీ, హామీగానే మిగిలిందన్నారు. పట్టాలు ఇవ్వకపోగా భూములు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మాసిటీ పేరుతో లగచర్లలో 3000 ఎకరాల గిరిజనుల భూములను బలవంతంగా లాక్కునేందుకు యత్నించారని గుర్తు చేశారు. సిపిఎం బృందం లగచర్ల పర్యటనకు తొలుత అనుమతి నిరాకరించిన సిఎం.. రాష్ట్ర వ్యాప్తంగా ఎర్రజెండాలు ఉద్యమిస్తాయని హెచ్చరించడంతో అనుమతించారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం అక్కడున్న భూములకు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం నాలుగు రెట్లు అదనంగా చెల్లించాలని తాము సిఎంను డిమాండ్ చేసినట్టు చెప్పారు. అంతేకాదు, ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవడం కమ్యూనిస్టుల విజయంగా తెలిపారు. ఓట్లూ సీట్లూ లేకున్నా ఎర్రజెండా గుండె బలంతోనే ఇదీ సాధ్యమైందన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని

పక్కనున్న శ్రీలంకలో మూడు శాతం ఓట్లున్న కమ్యూనిస్టులు అప్పటి ప్రధాని రాజపక్సే నిరంకుశ విధానాలపై తిరుగుబాటు చేయడంలో విజయం సాధించారని, ఫలితంగా ఆ దేశ ప్రజలు కమ్యూనిస్టు నాయకులు దిసనాయకే 49శాతం ఓట్లతో పట్టం కట్టారని తెలిపారు. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ మూడింట రెండొంతుల సీట్లను కమ్యూనిస్టులు సాధించటం గమనార్హం అని అన్నారు. మన దేశంలోనూ ప్రభుత్వాలు అదే తరహా పాలను కొనసాగిస్తున్నాయని, ఇదే నిరంకుశ పాలన కొనసాగితే దేశంలోనూ కమ్యూనిస్టుల పాలన వస్తుందనే విశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. సాయిబాబు, పోతినేని సుదర్శన్ కూడా ప్రసంగించారు. ఈ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, కల్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బొంతు రాంబాబు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు మనస్సు ప్రధానం

- సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

ప్రజాశక్తి - కల్చరల్

సమాజ సేవకు పదవులు అధికారం అవసరం లేదనీ చేయాలన్న తపన మనసు ఉంటే ఇతరులకు సహాయ సహకారాలు అందిచవచ్చని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వర లక్ష్మి హెవెన్ హెూమ్స్ సొసైటీ స్థాపించి పలు రంగాలలో చేస్తున్న కృషి అభినందనీయం అని పేర్కొన్నారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై హెవెన్ హెూమ్స్ సొసైటీ ద్విదశాబ్ది వేడుకల సంగీత నత్య భరితం గా కన్నుల పండుగ గా జరిగాయి ముఖ్య అతిథిగా పాల్గొన్న జూపల్లి కృష్ణా రావు సేవా కళా విద్యా రంగాలలో కషి చేస్తున్న వారితో పాటు టెలివిజన్ చానెల్‌లో మహిళా జర్నలిస్ట్ లకు సేవా భారతి పురస్కారాలు బహుకరించి మాట్లాడారు. పురస్కారాలు సుదీర్ఘ కాలం వారి రంగంలో వారు చేసిన కార్యక్రమాలకు గుర్తింపు రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహం గా పని చేసేందుకు దోహదం చేస్తుంది అని చెప్పారు మహిళా సాధికారత ఎన్ని చట్టాలు చేసినా ఆశించిన ఫలితం లేదని అన్నారు ఇందుకు కారణాలు మేధావులు స్వచ్ఛంధ సంస్థలు ఆలోచించి ప్రభుత్వాలకు తగిన సూచనలు ఇవ్వాలనీ కోరారు సంస్థ స్థాపకురాలు వర లక్ష్మి స్వాగతం పలుకుతూ రెండు దశాబ్దాలు గా మహిళా సాధికారత లక్ష్యం గా హెచ్ హెచ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ స్థాపించి పిల్లల రక్షణ మహిళలకి స్వయం ఉపాధి కోర్సులు ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించి ఉభయ తెలుగు రాష్ట్రాలలో కార్యక్రమాలు నిర్వహించాము అని తెలిపారు వేదిక పై విశ్రాంత న్యాయ వాది మాల్యాద్రి సి బి ఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా సంస్థ స్థాపకురాలు వరలక్ష్మి కి మహిళా సాధికారత కోసం ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో పేరు నమోదు చేసిన ద్రవ పత్రాన్ని మంత్రి ద్వారా రికార్డ్స్ ప్రతినిధులు అందజేశారు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఇన్నారెడ్డి

- సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరుమల్‌రెడ్డి ఇన్నా రెడ్డి ఖరారైనట్టు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ (సిపిఎస్) యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై యూనియన్‌లో చర్చించామని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ హజరైనట్టు తెలిపారు. 28 ఏళ్లుగా తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ఉపాధ్యాయులకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఎస్ అధ్యాపకున్ని, మరోవైపు పాత పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యా యున్ని అభ్యర్థులుగా పోటీలో నిలిపి, సిపిఎస్ ఒపిఎస్ అనే తేడా లేకుండా ఉపాధ్యాయ వర్గం నుండి పెట్టుబడిదారి పెన్షన్ విధానాన్ని పారదోలేందుకు సిపిఎస్ విధానంపై రెఫరెండంగా ఎన్నికల్లో బరిలో ఉన్నామన్నారు రాష్ట్ర ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, పోల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున్, రాజేష్ వనమాల, సిర్పూర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పోరాటాలే.. అమరులకు సరైన నివాళి

- మోడీ పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యం
- అంబానీ, అదానీలకు దేశ సంపదను కట్టబెట్టే యత్నం
- పోటు ప్రసాద్ సంస్మరణ సభలో అమర్జిత్ కౌర్, కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ బహుముఖ పోరాటాలకు నేతృత్వం వహించి అమరులైన వారికి ప్రజా పోరాటాల కొనసాగింపే సరైన నివాళి అని సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్ తెలిపారు. విద్యార్థి దశ నుంచి కార్మిక నాయకునిగా, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గత నెల 27న మరణించిన సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఖమ్మంలోని పాత మమత మెడికల్ కళాశాలలోని పువ్వాడ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో అమర్జిత్ కౌర్ మాట్లాడారు. పోటు ప్రసాద్ కుటుంబం మూడు తరాల నుంచి కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ వచ్చారని, మూడో తరం వారైన ప్రసాద్ విద్యార్థి ఉద్యమంలోనూ, కార్మిక ఉద్యమంలోనూ ఎంతో నిబద్ధతతో పని చేశారని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ శ్రేణులను ప్రజా పోరాటాలకు సన్నద్ధం చేసేవారని గుర్తుచేశారు. యువశక్తి నిర్వీర్యం అవుతుందని, ప్రభుత్వ రంగంలో నియామకాలు లేవని, ప్రభుత్వ రంగాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తూ అంబానీ, అదానీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 25 శాతం మంది రోజు వారి కూలీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరుగుతుండటంతో దేశ వ్యాప్తంగా పలు పోరాటాలు మొదలవుతున్నాయన్నారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను సైతం కేంద్ర ప్రభుత్వం హరించివేస్తుందని విమర్శించారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

సభలో మాట్లాడుతున్న అమర్జిత్ కౌర్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తుదిశ్వాస వరకు నిబద్ధత, నిస్వార్థంతో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి కృషి చేసిన పోటు ప్రసాద్‌కి నివాళిగా సిపిఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపు సభ ఖమ్మంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, వనజ, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, నాయకులు పోట్ల మాధవరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు కె రాంనారాయణ, ఎ ఆదినారాయణ తదితరులు మాట్లాడారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపజేశాయి.

చట్టవిరుద్ధంగా ఫిజిషియన్ శాంపిళ్ల నిల్వ

- క్రాంతి మెడికల్ అండ్ జనరల్ స్టోర్ లో తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్ కంట్రోల్ అధికారులు చేసిన దాడుల్లో అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. హన్మకొండ జిల్లా, వేలేర్ మండలం, వేలేర్ గ్రామంలోని క్రాంతి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌పై చేసిన దాడిలో పెద్ద మొత్తంలో ఫిజిషియన్ శాంపిళ్లను పట్టుకున్నారు. వీటితో పాటు కాలం చెల్లిన మందులనూ డిసిఎ అధికారులు సీజ్ చేశారు. వీటి విలువ రూ ఒక లక్ష వరకు ఉంటుంది. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు చేసిన ఈ దాడిలో ఉచితంగా డాక్టర్లు ఇవ్వాల్సిన ఫిజిషియన్ శాంపిళ్లు ఉన్నాయి. 65 రకాల మందులను అధికారులు ఫిజిషియన్ శాంపిళ్లతో పాటు ఆరు రకాల కాలం చెల్లిన మందులను అధికారులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

10 నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

- టిఎస్ఎస్‌యుఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం (టిఎస్ఎస్‌యుఎస్) రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య , కార్యనిర్వాహక అధ్యక్షులు అనిల్ చారి, కోశాధికారి దుర్గం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్ డౌన్, చాక్ డౌన్‌తో కెజిబివి, యూఆర్ఎస్, భవిత సెంటర్లలో బోధన ఆగనుందని పేర్కొన్నారు. సమ్మెలో జిల్లా విద్యా, మండల విద్యాశాఖ కార్యాలయాల సిబ్బందితో పాటు క్లస్టర్ పాఠశాలల సిబ్బంది, ఉన్నత పాఠశాలలోని ఒకేషనల్ ఇన్ స్ట్రక్టర్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలిరండి

- టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీ ఎత్తున తరలి రావాలని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి ఆయన పార్టీ నాయకులతో ఆయన జూమ్‌లో మాట్లాడారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉందని తెలిపారు. ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లలతో ఆయన మాట్లాడారు. ఏడాదిలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. మోజార్టీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఏడాది పాలనపై ప్రభుత్వం నిర్వహిస్తున్న సభలకు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారని అన్నారు. సోమవారం జరిగే ముగింపు ఉత్సవాల్లో భాగంగా సచివాలయం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు.

విగ్రహ రూపశిల్పి రమణారెడ్డికి అభినందనలు

రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ అమరవీరుల జ్యోతి రూపశిల్పి రమణారెడ్డిని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. తెలంగాణ తల్లి విగ్రహంలో అమరవీరుల పిడికిళ్లను జోడించడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- ద్విచక్ర వాహనాలను ఢీకొని ఘటన
- గజ్వేల్, ఆశ్వారావుపేటలో ఘటనలు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా గజ్వేల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ రూరల్ మండలంలోని రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న వర్కల్ పరంధాములు (46), పూసల వెంకటేష్ (38) ఇద్దరూ కలిసి రాయపోల్ నుంచి హైదరాబాద్ ఇసిఐఎల్‌లో రన్నింగ్ మారథాన్‌కు ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై బయలుదేరారు. అయితే గజ్వేల్ పట్టణ సమీపంలోని జాలిగామ బైపాస్ రోడ్డుకు వచ్చే సమయానికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ప్రమాదం గురించి గజ్వేల్ సిఐ సైదా జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దాంతో ఎస్‌పి డాక్టర్ అనురాధ, అడిషనల్ డిసిపి యస్.మల్లారెడ్డి, సిద్దిపేట ఎసిపి మధు గజ్వేల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సైదా, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మార్చురీలో ఉన్న మృతదేహాలపై పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి.. తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డిపార్ట్‌మెంట్ తరఫున రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామన్నారు. తక్షణ ఖర్చుల కోసం ప్రభుత్వం తరఫున ఇరు కుటుంబాలకు కలిసి రూ.60 వేలు అందజేశారు. అదే విధంగా, మృతుల స్నేహితులు, అధికారులు, సన్నిహితులు పలువురు వారి మృతదేహాలను సందర్శించి పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు. పలు సామాజిక సేవ కార్యక్రమాల్లో వీరిద్దరూ ముందుండేవారని వారు కొనియాడారు. కాగా, ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు.. వారి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు.

రన్నింగ్ మారథాన్‌లో పాల్గొన్న పరంధాములు, వెంకటేష్ (ఫైల్)

ఆశ్వారావుపేటలో ఇద్దరు మృతి

ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని లారీ వేగంగా ఢీ కొట్టడంతో వాహనంపై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. వారిలో ఇద్దరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం (నారాయణపురం)కు చెందిన పేరాబత్తుల మనోజ్ (27) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మారెప్ప గూడెంలో కౌలు పద్ధతిలో వేరుశనగ సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం తన స్వగ్రామానికి చెందిన మొగిటి వీరభద్రంతో పాటు అశ్వారావుపేట మండలం పాపిడిగూడెంకు చెందిన బద్దే వెంకటేశ్వరరావు (57)ను తీసుకుని ద్విచక్ర వాహనంపై ఆదివారం బయలుదేరాడు. వీరు ముగ్గురు ద్విచక్ర వాహనం ప్రయాణిస్తూ నారంవారిగూడెం కాలనీ సమీపంలోకి రాగానే లారీ ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోజ్, వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. వీరభద్రం తీవ్రంగా గాయపడటంతో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్ఐ యయాతి రాజు మృతదేహాలను పంచనామా నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, లారీ డ్రైవర్ గోళ్ల సైదులు మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మృతుడు మనోజ్ తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బాధిత కుటుంబ సభ్యులు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.

ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి

- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో బిఆర్ఎస్ఎల్పీ భేటీ
- అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కెసిఆర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీయాలని మాజీ సిఎం, ప్రతిపక్ష నేత కెసిఆర్ దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాజీ సిఎం కెసిఆర్ సూచించారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి.. పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చటం మూర్ఖత్వమేనని, ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా..? ఇలా మార్పులు చేసుకుంటూ పోతే ఎలా..? అని చెప్పారు.

ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతోపాటు హైడ్రా, లగచర్ల ఘటనలపై కూడా ప్రశ్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కెటిఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, చింతా ప్రభాకర్, సుధీర్ రెడ్డి, అనిల్ జాదవ్, పాడి కౌశిక్ రెడ్డి, మాణిక్‌రావు, వివేక్ మందా గౌడ్, బండారు లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సుంకరి రాజు, షేర్ సుభాష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, వంటేరు యాదవ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, మధుసూదనా చారి, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ రమణ, దేశపతి శ్రీనివాస్, మధుసూదన్ టాటా, వాణి దేవి, రమణరెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాడుతాం : ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్

ప్రజా సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పి పోరాడుతామని, ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కెటిఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం దిశా నిర్దేశం చేసిన అనంతరం విలేకరులతో హరీశ్‌రావు, కేటీఆర్ వేర్వేరుగా మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుకు మొదటి శాసనసభలో చట్టబద్ధత తెస్తామని హామీనిచ్చినా అమలు చేయలేదన్నారు. ఇలాంటి ఎన్నో హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఫార్మాసిటీ పేరుతో లగచెర్లలో గిరిజనుల భూములను అక్రమంగా లాక్కొని వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా రెండు పంటలకు ఇవ్వడంలో విఫలమయ్యారని తెలిపారు. రైతుల పక్షాన బిఆర్ఎస్ నిరంతరం గళం విప్పి పోరాటాలు చేస్తున్నదన్నారు. దళిత బంధు, బిసి బంధు, గిరిజ బంధు వాటిపై శాసనసభ, శాసన మండలిలో పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం కలసి రాకపోతే అర్జెంటు మోషన్ ఇచ్చి అయినా.. చర్చలకు పట్టు పడుతామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కెసిఆర్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- రాజ్యాంగ, మౌలిక విధానం, లౌకికతత్వాన్ని కాపాడాలి : ప్రొ. నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, రాజ్యాంగ, మౌలిక విధానం, లౌకికతత్వాన్ని కాపాడాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ప్రారంభమైన టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ఆరో మహాసభల్లో నాగేశ్వర్ పాల్గొని మాట్లాడారు. ఈ దేశ ఐక్యతను, ప్రతిష్టతను, అభివృద్ధిని చాటే భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, సామ్యవాదం.. అంశాలను తొలగించాలని ఆలోచనలు చేయడం అభివృద్ధి నిరోధకాలే అవుతాయన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు గడిచిన సందర్భంగా ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలైనా లౌకికవాదం, సామ్యవాదం తొలగించాలనే ఆలోచన చేయడం సరైంది కాదని, వాటి మీద చర్చను కూడా జరపాల్సిన అవసరం లేదని తోసిపుచ్చిందని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం కొన్ని మౌలిక అంశాల ఆధారంగా నిర్మించబడిందని తెలిపారు. పార్లమెంటుకు రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఉందా.. అనే వాదనకు ఆయన రాజ్యాంగం మార్చే అధికారం లేదని, రాజ్యాంగంకు లోబడే పని చేయాలన్నారు. భారతదేశం వివిధ మత విశ్వాసాలతో కూడినదని, మత విశ్వాసాన్ని రాజ్యానికి రుద్దొద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.


మహాసభలో మాట్లాడుతున్న నాగేశ్వర్

కొడుకును బావిలో తోసి తల్లి ఆత్మహత్య

- వికారాబాద్ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడుకును బావిలో తోసి ఆపై తల్లి కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గేట్ వనంపల్లి గ్రామానికి చెందిన గుళ్ల రాములు, అరుంధతి (35) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు రుత్విక్ (7), కూతురు ప్రజ్వల ఉన్నారు. శనివారం సాయంత్రం రాములు పొలం వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో అరుంధతికి ఫోన్ కాల్ వచ్చింది. ఆ ఫోన్ మాట్లాడిన తరువాత ఏడుస్తూ ఆమె కుమార్తె, కుమారుడిని తీసుకుని గ్రామంలోని ఓ బావి వద్దకు వెళ్లింది. మొదట తన కొడుకుని బావిలో తోసేసింది. ఇది చూసిన ఆమె కూతురు భయపడి అక్కడి నుంచి పారిపోయింది. అనంతరం అరుంధతి కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని మృతురాలి కూతురు గ్రామస్తులకు చెప్పడంతో వారు పోలీసులకు, మృతురాలి భర్తకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. చనిపోవడానికి ముందు మృతురాలికి ఎవరు ఫోన్ చేశారు. ఆమె మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.